సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.08లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధాన్యతినిస్తున్నామన్నారు. మొగల్తూరు మండలంలో తాగునీరు, మురుగు నీటి సమస్య, రహదారుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరుకు ఎలాంటి సమస్యాలేదని, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో రూ.15ల క్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పడవల మేరీ, తణుకుల మునేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, ఎంపీపీ అందే సూర్యావతి, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతా మహలక్ష్మి, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, నాయకులు కర్రి ఏసుబాబు, అందే భుజంగరావు, ఆంద్రాజు చల్లారావు, గుబ్బల నారాయణ మూర్తి, మోటుపల్లి రాంభాస్కరరావు, పాలా రాంబాబు, గురుజు చిన్ని, పడవల సత్యనారాయణ, రంగిశెట్టి ఏసు, తస్నీడి గిరి పాల్గొన్నారు.



నరసాపురం మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


పడమటిపాలెంలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

నరసాపురం రూరల్: గ్రామాలలో మౌళిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు అధికారులతో సమన్వయం చేసుకుని వచ్చిన నిధులను సకాలంలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖల ద్వారా గ్రామాల వారీగా మంజూరైన పనులు, ఆయా పనులు ఏఏ దశల్లో ఉన్నాయనే విషయాలను సమీక్షించారు. మండల పరిషత్ నిధుల నుంచి 48 పనులకు సంబంధించి 1.39కోట్లు నిధులు మంజూరు చేయగా ఇప్పటి వరకూ రూ.52 లక్షలతో 14 పనులు పూర్తికాగా మరో రూ.87 లక్షలకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయని పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు వివరణ ఇచ్చారు. రహదారుల అభివృద్ధికి రూ.18 లక్షలు ఒక్క కొప్పర్రు గ్రామానికి విడుదల చేస్తే రూ.3 లక్షలు మాత్రమే పనులు జరిగాయని తెలుపగా మిగిలిన 15లక్షలకు సంబంధించిన పనులను కూడా వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రాజుల్లంక గ్రామం నుండి, చిన్నసారవ, పెద్దసారవ గ్రామాల మీదుగా అటు ధర్బరేవు, ఇటు కరింశెట్టివారిపాలెం రహదారులను కలుపుతూ సీసీ, బీటీ రహదారని నిర్మాణానికి రూ.6.75కోట్లు మంజూరు చేసుకుని పనులు ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి, కొత్త పైప్‌లైన్ ఆధునీకరణ తదితర 80 పనులకు సంబంధించి 29 కోట్లు మంజూరు చేయగా 35 పనులు పూర్తి కాగా మరో 45 పనులు పురోగతిలో ఉన్నాయని ఏఈ లోకేష్ వివరించారు. అలాగే ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు సీఎం డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి 5 గ్రామాలకు రూ.23లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో 100 శ్మశాన వాటికల అభివృద్ధికి ఒక్కోదానికి రూ.14 లక్షలు నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే ప్రసాదరాజు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మండలానికి సుమారు రూ.4.80కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని, వాటిలో సుమారు 74 పనులు పూర్తి కాగా 24పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాదాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, తహసీల్దార్ ఫాజిల్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి


చినమామిడిపల్లిలో దెబ్బతిన్న నారుమడిని చూపుతున్న రైతులు

నరసాపురం రూరల్: అధిక వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని వరదపోటుకి గురైన చిట్టవరం, చినమామిడిపల్లి, కొత్తనవరసపురం తదితర గ్రామాల్లో నీట మునిగిన నారుమడులను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. మాధవాయిపాలెం, కాజ లాకులు శిథిలావస్థకు చేరాయని వాటికి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. పట్టణానికి చెందిన 22 మంది దంపతులు పాల్గొని చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అభిషేక పండితులు బ్రహ్మశ్రీ భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛరణలతో హోమం వైభవంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. పట్టణానికి చెందిన డా.గోపాలకృష్ణ విరాళంతో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్టీలు, ఈవో యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు కుట్టు మెషీన్ అందజేత


మహిళకు కుట్టు మెషీన్ అందజేస్తున్న యడ్ల తాతాజీ, నాయకులు

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. పాలకొల్లు మండలం వరిధనంలో మంగళవారం ఒంటరి మహిళకు కుట్టు మెషీన్ అందజేశారు. నియోజకవర్గంలో సర్వే చేసి 40 మంది ఒంటరి మహిళలకు కుట్టు మెషీన్లు అందజేయనున్నట్లు తాతాజీ వివరించారు. ఈ కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకులు వర్ధనపు మోహన్‌రావు, పెచ్చెట్టి ఏడుకొండలు, కవురు ఆంజనేయులు, కవురు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గంటా నరేష్‌బాబు, పెచ్చెట్టి కృష్ణాజీ, చెన్ను విజయ్, పిల్లా అప్పాజీ, కొత్రగింజల హనుమంతరావు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఏకలవ్య


పండితవిల్లూరు సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు

పోడూరు: పండితవిల్లూరు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్దాడ ఏకలవ్య రెండోసారి నియామకమయ్యారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులుగా నియామకమైన గొట్టుముక్కల ఏసురత్నం, గుబ్బల ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 6 నెలల కిందట వీరు త్రిసభ్యకమిటీగా బాధ్యతలు స్వీకరించారు. పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరు రెండోసారి నియామకమయ్యారు. వీరిని సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, సొసైటీ సీఈఓ ఉదయభాస్కరరావు, ఉపసర్పంచ్ సదమళ్ల వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇళ్ల శ్రీనివాస్, మేడిచర్ల పండు తదితరులు అభినందించారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

పాలకొల్లు అర్బన్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ పసుపులేటి చినబాబు కోరారు. పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతీపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి వరదరాజులు, ఆకుమర్తి మోషే, దిద్దే రాజశేఖర్, ఆకుమర్తి రాజేష్, ఆకుమర్తి కుమార్ రాజా, ఆకుమర్తి బన్నీ, ఆకుమర్తి బుద్దేశ్వరరావు, తవిట కోటయ్య, ఆకుమర్తి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టేక్‌హోమ్ రేషన్ కిట్ల పంపిణీ

పెనుమంట్ర: స్త్రీశిశు సంక్షేమ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు అందజేసే సంపూర్ణ పోషణ కిట్‌లు(టేక్‌హోమ్ రేషన్) పంపిణీని బుధవారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభిస్తారని పెనుమంట్ర ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ ఎం విజయకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మార్టేరు మావుళ్లమ్మ దేవాంగుల కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

విద్యాబోధనపై శ్రద్ధ అవసరం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

వీరవాసరం: విద్యా బోధనపై ఉపాధ్యాయులంతా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి విద్యా బోధన చేయాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.

యూకేసీ వనితా క్లబ్‌కి అవార్డుల పంట

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ అనుబంధ కమిటీ వనితా క్లబ్‌కి ఏడు విభాగాల్లో అవార్డులు లభించాయని అధ్యక్షురాలు మంగిన అరుణ తెలిపారు. అడబాల గార్డెన్స్‌లో నిర్వహించిన అవార్డుల ఫంక్షన్‌లో గవర్నర్ డా.ముచ్చర్ల సంజయ్, మాజీ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు, ఎంఎస్ వాసు తదితరుల చేతుల మీదుగా ఈ అవార్డులు తీసుకున్నట్లు వివరించారు. బెస్ట్ హెల్త్ సర్వీస్ అవార్డు, బెస్ట్ సపోర్టు టు ఎడ్యుకేషన్ అవార్డు, బెస్ట్ సపోర్టు టు నీడీ అండ్ పూర్ అవార్డు, బెస్ట్ ఫ్యామిలీ ఆఫ్ యూకేసీ అవార్డు, బెస్ట్ మెంబర్‌షిప్ గ్రోత్ అవార్డు, బెస్ట్ ఆడియో అండ్ వీడియో ప్రెజెంటేషన్ అవార్డు, బెస్ట్ వనితా క్లబ్ ప్రెసిడెంట్ అవార్డులు లభించాయన్నారు. కార్యదర్శి యామన విజయలక్ష్మి, శిద్దిరెడ్డి శైలజారాణి, గణేష్న రాధ, మండెల లక్ష్మి భార్గవి, అడబాల జ్యోతి, కర్రి రేవతి, డా.సంగినీడి జ్యోతి, నారిన సూర్యకుమారి, రావి సృజన, గాదె విజయలక్ష్మికుమారి, కుంపట్ల రీతూ అవార్డులు పొందిన వారిలో ఉన్నారని అరుణ తెలిపారు.


అవార్డులు పొందిన యూకేసీ వనితా క్లబ్ సభ్యులు

ప్రభుత్వ స్పందనపై ఆక్వా రైతుల హర్షం

పాలకొల్లు అర్బన్: ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు జై భారత్ శ్రీ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు తెలిపారు. పాలకొల్లు లో ఆక్వా రైతు సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ సమక్షంలో ఆక్వా రైతు సంఘాలతో కాకినాడలో జరిగిన సమావేశ వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. రొయ్యల పట్టుబడి సమయంలో గతంలో నెట్‌కి 1400 గ్రాముల నుంచి 1800 గ్రాముల వరకు తూకంలో తగ్గింపు ఉండేదన్నారు. దాన్ని నెట్ తూకంలో 200 గ్రాములు తగ్గింపునకు ఆమోదించినట్లు తెలిపారు. అలాగే రొయ్యల కౌంట్ ధరలు కూడా నిర్ణయించినట్లు తెలిపారు. పెరిగిన ధరలు కనీసం 10 రోజులు అమలులో ఉండేలా ఆక్వా అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. ఒకసారి ప్రకటించిన ధరలు తగ్గించకుండా పెరిగేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సజ్జా వీర వెంకట సత్యనారాయణ (బుజ్జి), టీయూవీఆర్ సుధీర్ రెడ్డి, కోడి విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి బోనం వెంకట నరసయ్య (చిన బాబు), సహాయ కార్యదర్శులు గుంటూరి వెంకట సత్యనారాయణరాజు, మేడిది జాన్ డేవిడ్‌రాజు, మేక ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న జై భారత్ శ్రీక్షీరారామ ఆక్వా రైతు సంఘం నాయకులు

మానవత యలమంచిలి శాఖ ఏర్పాటు

యలమంచిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ యలమంచిలి మండల శాఖ ఏర్పాటైంది. దొడ్డిపట్ల గ్రామంలోని ఆకి రాము ఇంటి వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ ఇది సంస్థకు 100వ శాఖ అన్నారు. నూతన పాలకవర్గ సభ్యులంతా సేవా భావంతో పని చేయాలని కోరారు. డైరెక్టర్స్ బోర్డ్ కమిటీ అధ్యక్షుడిగా డేగల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా రుద్రరాజు బాల విజయవర్మ, ఉపాధ్యక్షుడిగా బోనం చిన్నయ్య నాయుడు (నానాజీ), కార్యదర్శిగా మెట్టపల్లి రాంబాబు, కోశాధికారిగా అడబాల వెంకటేశ్వరరావు, విద్యా విభాగానికి నారిన మురళీకృష్ణ, వైద్య విభాగానికి గుబ్బల శామ్యూల్ పుల్లారావు, అత్యవసర విభాగానికి డేగల సత్తికొండ, గ్రామీణ విభాగానికి అడబాల రాజేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు, పాలకొల్లు శాఖ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి ప్రతాప్‌రాజు, కోశాధికారి వాసు, వలవల యజ్ఞ ప్రసాద్, డేగల సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.


దొడ్డిపట్లలో ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గ సభ్యులు

మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అందరం భాగస్వామ్యం వహిద్దామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపాల్ కార్యాలయంలో శానిటరీ సిబ్బంది, ఇంజినీర్లు, ఏఈ, డ్రైవర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడం వల్ల ఇకపై వారంలో రెండు రోజులు అనగా మంగళవారం, శుక్రవారం డ్రై డే లుగా నిర్వహించాలన్నారు. అన్ని డ్రెయిన్లు, కల్వర్టుల వద్ద ఎబెట్ ఆయిల్ స్ప్రే చేయించి నీరు నిలువఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్ మెషీన్లు, స్ప్రేయర్లు మంచి కండిషన్‌లో ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే హోటళ్లు, కర్రీ పాయింట్లు, తదితర షాపుల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లేట్లు సీజ్ చేయాలని ఆదేశించారు.


మున్సిపల్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లిపాలే అమృతమని, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి పాలు ఎంతగానో దో హదపడతాయని డీఎంహెచ్ఓ డి మహేశ్వరరావు అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక, ప్రభుత్వ వైద్య శాఖ ఆధ్వర్యంలో భీమవరం లూథరన్ కళాశాలలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. బిడ్డ శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, విటమిన్లు వంటి పోషకాలన్నీ తల్లి పాలలో సమతూకంలో ఉంటాయని, కాన్పు తర్వాత మొదటి రెండు మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమని, ఇవి ఒక రకంగా తొలి టీకా లాంటివని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు అప్పుడేపుట్టిన శిశువుకు నీరు, గ్లూకోజు నీరు, తేనెలాంటి పదార్థాలు తాగించొద్దని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తరువాత మొదటి ఆరు నెలలు కూడా బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను అవగాహనా ప్రచార కార్యక్రమాలను తెలిపారు. అనంతరం ఆశ వర్కర్స్, హెల్త్ సూపర్‌వైజర్స్ ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఎంవో డాక్టర్ సుగుణ రాజు, ఎస్ఓ సర్వేశ్వర ప్రసాద్, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన వరద గోదారి

ఎగువున కురుసిన భారీ వర్షాలకు పోటెత్తిన గోదావరి క్రమేపి తగ్గుతుంది. ముఖ్యంగా గోదావరి లంక ప్రాంతాల ప్రజలు ఈ వరదలో అవస్థలు పడ్డారు. వరద నేపథ్యంలో అధికారులు, నాయకులు బాధితులకు అండగా నిలబడ్డారు. ప్రభుత్వం వేగంగా స్పందించి పునరావసం కల్పించడంతో పాటు బాధితులకు కూరగాయలను పంపిణీ చేసింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ వరద గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మంగళవారం వరద జోరు తగ్గింది. పూర్తిస్థాయిలో వరద తగ్గడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుంది.

- నరసాపురం రూరల్/యలమంచిలి


చించినాడ గోదావరి వంతెన దిగువున జలమయమైన ఆక్వా చెరువులు


దొడ్డిపట్ల మత్స్యకారకాలనీలో వరద ముంపు నుంచి పాక్షికంగా బయటపడిన రోడ్డు


కనకాయలంక కాజ్‌వే వద్ద పడవ దాటి వస్తున్న గ్రామస్తులు


పెదలంకలో కూరగాయలు ప్యాక్ చేస్తున్న వలంటీర్లు

వరద బాధితులకు సంపూర్ణ సహకారం

యలమంచిలి: వరద బాధితులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. వరద ముంపునకు గురయిన కనకాయలంక గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద తగ్గుముఖం పడుతుందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ప్రజలకు నిత్యావసర సరుకులు, పాడి రైతులకు పశుగ్రాసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వలవల ప్రసాద్, పార్టీ నాయకులు నెల్లి ఆనందరావు, పులి సుబ్రహ్మణ్యం, పులి కాశీ విశ్వేశ్వర కేశవమూర్తి, గుడిశే ప్రభాకర్, కారిపల్లి చిట్టిబాబు, చిల్లే రవి, చిట్టిమేను ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కనకాయలంకలో పాడి రైతులకు పశుగ్రాసం ప్యాకెటు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

మున్సిపల్ ఉద్యోగుల ధర్నా

నరసాపురం రూరల్: మున్సిపాలిటీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకుడు నల్లి థామస్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పొన్నాడ రాము, పెద్దిరాజు, ఉద్యోగులు నాగబాబు, ధనరాజు, రాజేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ల: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ల పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కరం గ్రామానికి నల్లూరి శివ (30) కు ఉండి గ్రామానికి చెందిన పద్మఅనూషతో సుమారు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే మృతుడు శివ తన సమీప బంధువుతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలుసుకున్న భార్య గొడవపడి 8 నెలల క్రితం పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ నేపథ్యంలో కాపురం చక్కదిద్దేందుకు ఇరుపక్షాల పెద్దలు సోమవారం మధ్యాహ్నం మృతుడి ఇంటివద్ద సమావేశమయ్యారు. పెద్దలు మాట్లాడుకుంటున్న సమయంలో మృతుడు మద్యం సేవించి వచ్చి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కి ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యం కోసం భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ శివ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కాళ్ల: పని ముగించుకుని ఇంటికి మోటార్ బైక్ పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనపై కాళ్ల పోలీసు స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల గ్రామానికి చెందిన పాకెర్ల కాంతరాజు సోమవారం సాయంత్రం పని ముగించుకుని భీమవరం నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా జక్కరం గ్రామం సెంటర్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కాంతరాజును 108 వాహనంలో భీమవరం పట్టణంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన స్టేట్మెంట్ మేరకు మంగళవారం కాళ్ల ఎస్సై ఏజీఎస్‌మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కాళ్ల: తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల పోలీసు స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరుకి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి కాళ్ల మండలం పల్లిపాలెం గ్రామంలో జీవనోపాధి నిమిత్తం ఆక్వా చెరువులపై కాపలాగా ఉంటూ నివాసం ఉంటుంది. ఈతరుణంలో తమ కుమార్తె గత నెల 30 తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బాలిక తల్లి దయామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొగల్తూరుకి చెందిన పవన్ కుమార్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్సై తెలిపారు.